సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



వరిపై రసాయన పిడుగు

దాళ్వా వరిలో అధిక దిగుబడుల కోసం ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా వాడడంతో జింకు ధాతు లోపాన్ని వ్యవసాయ అధికారులు గుర్తించారు. 8లో ▸



వైభవంగా వార్షికోత్సవం

వాసవీ కన్యకాపరమేశ్వరి 90 అడుగుల పంచలోహ విగ్రహ ప్రతిష్టాపన ఆరో వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 8లో ▸



పురుగుమందులు సీజ్

కైకలూరు పట్టణంలో ప్రమాదకరమైన పురుగుమందులు విక్రయిస్తున్న దుకాణంపై శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేసి సీజ్ చేశారు. 8లో ▸

భారీగా ఎమ్మెల్సీ నామినేషన్లు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇంతవరకూ 20 నామినేషన్ల దాఖలు
- సోమవారం తుది గడువు
- ఈ నెల 27న పోలింగ్.. వచ్చే నెల 3న కౌంటింగ్
- 6 జిల్లాల పరిధిలో 440 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు



నామినేషన్‌లు స్వీకరిస్తున్న ఆర్వో వెట్రిసెల్వి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. శుక్రవారం ఒక్క రోజే 18 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇంత వరకు 20 మంది అభ్యర్థులు 24 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియనుండటంతో కీలక అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ దాదాపుగా పూర్తయ్యింది. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు కీలక దశకు చేరుకుంది. గత నెల 29న గెజిట్ జారీ చేయగా ఈ నెల 3న ఎన్నికల కమిషన్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 8, 9 తేదీల్లో సెలవు దినాలు కావడంతో సోమవారం ఒక్కరోజే నామినేషన్ల స్వీకరణకు తుది గడువు. శుక్రవారం మంచి ముహూర్తం కావడంతో ఉభయగోదావరి జిల్లాల నుంచి 18 సెట్ల నామినేషన్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వికి అందజేశారు. ఉభయగోదావరి జిల్లాల రిటర్నింగ్ అధికారిగా ఏలూరు కలెక్టర్ వ్యవహరిస్తుండటంతో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ అంతా ఏలూరు కలెక్టరేట్‌లోనే నిర్వహిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు ఏలూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. వచ్చే నెల 3న కౌంటింగ్ ప్రక్రియ ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 12, 22 తేదీల్లో మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. మొదటి దశ శిక్షణ పూర్తయిన వారికి 17న ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ మెటీరియల్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అందిస్తారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఉభయగోదావరి జిల్లాల్లో పరిస్థితిని మానిటరింగ్ చేస్తున్నారు.

440 పోలింగ్ కేంద్రాల్లో 3.15 లక్షల మంది ఓటర్లు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని 6 నూతన జిల్లాల్లో 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 3,15,261 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,83,734 మంది పురుషులు కాగా, 1,31,507 మంది స్త్రీలు.. 20 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఏలూరు జిల్లాలో 62, పశ్చిమగోదావరి జిల్లాలో 93, తూర్పు గోదావరి జిల్లాలో 82, కాకినాడలో 96, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 95 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. 28న అన్ని జిల్లాల నుంచి ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు బ్యాలెట్ బాక్సులు తరలిస్తారు.

ఇంతవరకు అందిన 24 సెట్లను 20 మంది అభ్యర్థులు సమర్పించారు. ప్రధానంగా కూటమి పార్టీలు బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ బలపరిచిన దిట్ల వీరరాఘవులతో పాటు పేపకాయల రాజేంద్ర, ములగల శ్రీనివాసరావు, గుండుమోలు బాలాజీ, కాట్రు నాగబాబు, వానపల్లి

బరిలో 20 మంది అభ్యర్థులు

శివ గంగ వీరగణేష్, బండారు రామ్మోహనరావు, నేతిపూడి సత్యనారాయణ, పచ్చిగోళ్ళ దుర్గారావు, బొమ్మిడి సన్నిరాజ్, మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు జీవీ సుందర్, కుక్కల గోవిందరాజు, కాంద్రేగుల నర్సింహులు, గద్దె విజయలక్ష్మి, కట్టా వేణుగోపాలకృష్ణ, మాకే ప్రసాద్, చిక్కాల దుర్గారావు, తాళ్ళూరి రమేష్, చిక్కా భీమేశ్వరరావులు నామినేషన్లు సమర్పించారు. 11న నామినేషన్లను పరిశీలిస్తారు. 13 వరకు ఉపసంహరణకు తుదిగడువుగా నిర్ణయించారు.

12 వేల గాజులతో అలంకరణ



దెందులూరు మండలంలోని గాలాయగూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాల తల్లిని శుక్రవారం 12,000 గాజులతో అలంకరించారు. 68 వ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ప్రధాన అర్చకుడు తిప్పభట్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి చేసిన ప్రత్యేక అలంకరణ కనువిందు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీ అచ్చమ్మ పేరంటాల తల్లిని దర్శించుకుని ఆలయ ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు.

- దెందులూరు

న్యూస్‌రీల్

సిగ్నస్-25 వెబ్‌సైట్ ఆవిష్కరణ



సిగ్నస్-25 వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

నూజివీడు: ట్రిపుల్ ఐటీలో ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక సాంస్కృతిక మహోత్సవం సిగ్నస్-25 వెబ్‌సైట్‌ను డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహోత్సవంలో దేశ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కళలు, నృత్యం, సాహిత్యం, నాటకాలు, సంగీతం వంటి రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. ఈ సాంస్కృతిక సంబరంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమలో ఉన్న సృజనాత్మకతను ప్రదర్శించాలన్నారు. ఏఓ బీ లక్ష్మణరావు మాట్లాడుతూ సిగ్నస్-25 అనేది వినోదానికి వేదిక కాదని, విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను ప్రదర్శించడానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఒక్క చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థులు సిగ్నస్-25 వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

బలివే శివరాత్రి ఏర్పాట్ల కోసం బహిరంగ వేలం

ముసునూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలో మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జరుగనున్న మహోత్సవాల్లో షామియానా సామగ్రి సప్లయి కోసం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా, ఏలూరుకు చెందిన టి.మల్లేశ్వరరావు రూ.1,75,000కు దక్కించుకున్నారు. తిరిగి ఫిబ్రవరి 10 తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద భోజన ఫలహారాల సప్లయి, క్యూలైన్ల కోసం ఐరన్ రాడ్ల సరఫరాకు టెండర్ కం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. ఆసక్తి గల వారు ఫిబ్రవరి 8న ఉదయం వేలంలో పాల్గొనాలని చెప్పారు.


రక్తదానంతో ఎన్నో జీవితాలకు పునర్జన్మ



రాయలంలో రక్తదానం చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ

భీమవరం అర్బన్: రక్తదానం ఎందరో జీవితాలకు పునర్జన్మనిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ అన్నారు. భీమవరం మండలంలోని రాయలంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెంటర్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఒకరిచ్చే రక్తదానం ముగ్గురి జీవితాలను కాపాడుతుందన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు రక్తదానం చేయాలని కోరారు. శుక్రవారం భీమవరంలోని రాయలం, తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 11న నరసాపురం, పాలకొల్లు, 13న తణుకు, 14న భీమవరంలోని రాయలంలో రెడ్‌క్రాస్ సొసైటీ సెంటర్లలో రక్త సేకరణ జరుగుతుందన్నారు. 300 యూనిట్ల రక్తాన్ని సేకరించాలనేది లక్ష్యమన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎం.శివరామ భద్రిరాజు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా సేకరించిన రక్తం ఎంతో మంది జీవితాలను కాపాడుతుందని చెప్పారు. మొదటిరోజు సుమారు 80 మంది రక్తదానం చేయగా.. వారికి సర్టిఫికెట్‌లు కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి నాగరాజు పాల్గొన్నారు.

మన్యం బంద్ జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాకి మధు

బుట్టాయగూడెం: ఈ నెల 12న జరిగే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కాకి మధు, కుంజా శ్రీను, జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు కోరారు. బుట్టాయగూడెంలో ఆదివాసీ కార్యాచరణ కమిటీ సమావేశం సోడెం ముక్కయ్య నివాసంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టాన్ని సవరణ చేయడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చెయ్యాలని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

క్రిస్టియన్ రాష్ట్ర నాయకుడిపై దాడి



భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు రాజ్‌కుమార్

ఉండి: తనపై హత్యాయత్నం జరిగిందని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తే రాజ్‌కుమార్ ఆరోపించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడి బంధువు, స్థానిక నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు ఈ దాడి జరిగిందని ఆయన పేర్కొన్నారు. రాజ్‌కుమార్ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉండి మండలం వాండ్రంకు చెందిన టీడీపీ నేత బంధువుకు చెందిన ఆక్వా చెరువును సుమారు 8 ఏళ్ల నుంచి లీజుకు తీసుకుని సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపాడు. గతంలో పంచాయతీ ఎన్నికల్లో ఒక వర్గానికి సహకరించిన కారణంగా మరో వర్గానికి చెందిన చెరువు యజమానులు తనపై పగబట్టారని తెలిపారు. అప్పటి నుంచి చెరువులు ఖాళీ చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారన్నారు. లీజు గడువు ఏడాది ఉందని.. గడువు ముగిసిన అనంతరం ఖాళీ చేస్తానని చెప్పానన్నారు. శుక్రవారం ఉదయం చెరువు యజమాని బంధువులు, స్థానిక టీడీపీ నేత బంధువులు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని చెప్పారు. తాను ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నా పోలీసులు వివరాలు తీసుకోవడానికి రాలేదని ఆరోపించారు. దీనిపై ఉండి పోలీసులను వివరణ కోరగా ఎలాంటి కేసు నమోదు చేయలేదని తెలిపారు.

పేదల భూమిలో ఆక్రమణలు



భీమడోలు మండలం పోలసానిపల్లిలో పేదలకు ఇచ్చిన భూమిలో స్తంభాలు, పైపులు ఉంచిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: భీమడోలు మండలం పోలసానిపల్లి జగనన్న కాలనీ రైతు భరోసా కేంద్రానికి ఎదురుగా పంపిణీ చేసిన వ్యవసాయ భూమిని అక్రమార్కులు రియల్ ఎస్టేట్‌గా మార్చేశారు. స్థల అమ్మకాల కోసం సిమెంట్ స్తంభాలు, ఐరన్ పైపులు దించారు. రెవెన్యూ అధికారులు స్పందించి పనులు నిలుపుదల చేశారు. వాస్తవానికి ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం గ్రామంలోని 8 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి 4.05 సెంట్ల చొప్పున సర్వే నెం.251/3లో వ్యవసాయ భూమిని ప్రభుత్వం అందించింది. ప్రస్తుతం అది చేతులు మారిపోయింది. రికార్డుల్లో సైతం ఆ భూమిపై గల వ్యక్తుల వివరాలు లేవు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు ఉన్న నిబంధనలు పట్టించుకోలేదని, అక్కడ అసలు లబ్ధిదారులు లేరని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నేత అంబటి దేవి తహసీల్దార్‌కు గత నెలలో ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి స్పందన కనిపించలేదు. ఇదే సాకుతో అక్రమార్కులు సిమెంట్ స్తంభాలు, ఐరన్ పైపులను దించి పనులకు ఉపక్రమించారు. దీంతో ఎంపీటీసీ, గ్రామస్తుల సమాచారం మేరకు పోలసానిపల్లి వీఆర్వో సాల్మన్‌రాజు సంఘటన స్థలానికి చేరుకుని పనులు జరగకుండా నిలుపుదల చేశారు.

భీమవరంలో పార్కుల అభివృద్ధికి చర్యలు



పార్క్ అభివృద్ధి పనుల డిజైన్ డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం పట్టణంలో శరవేగంతో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ప్రధాన పార్కులో జరుగుతున్న పార్క్ అభివృద్ధి పనులను శుక్రవారం కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. పార్కులో అభివృద్ధి పనుల డ్రాయింగ్‌ను పరిశీలించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పట్టణంలో ప్రజలను, ముఖ్యంగా పిల్లలను ఆహ్లాదకరంగా ఉంచేందుకు అవసరమైన ప్రదేశాలు ఏమీ లేకపోవడంతో ఆలోచన చేసి దాతల సహకారంతో అన్ని పార్కులను దశలవారీగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా హౌసింగ్ బోర్డ్‌లోని ప్రధాన పార్కును ఇప్పటికే రూ.10 లక్షలతో గ్రౌండ్ లెవలింగ్, స్టేజ్ రీ మోడలింగ్, స్ట్రక్చర్స్ ఏర్పాటు పనులను చేపట్టామన్నారు. ఇంకా రూ.20 లక్షల విలువైన పనులను చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఈ పార్కు అభివృద్ధికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నిధులను సమకూరుస్తుందన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ.3 లక్షలతో హౌసింగ్ బోర్డ్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల మానిటరింగ్‌ను పరిశీలించారు. మున్సిపల్ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు, హౌసింగ్ బోర్డ్ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.రామారావు, సెక్రటరీ జె.మధుసూదనరావు, ట్రెజరర్ సీహెచ్‌వీఎల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా ప్లాస్టిక్ నిర్మూలన

జిల్లాలో దశల వారీగా ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఏఈ టెక్నాలజీ కంపెనీ ప్రతినిధులు కలిసి ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా తయారు చేసిన బయో ఎలైట్ ఉత్పత్తులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు కంపెనీ ప్రతినిధి కె.దిలీప్ వివరిస్తూ మొక్కజొన్న కండి లోపలి భాగాన్ని వినియోగించి వివిధ వస్తువులు తయారు చేస్తున్నట్లు చెప్పారు. వాటిని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో దశల వారీగా ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొదటిగా కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిల్స్ బదులుగా స్టీల్ బాటిల్స్, స్నాక్స్ ప్లేట్స్, టీ తాగడానికి గాజు గ్లాసులు, స్టీల్ వాటర్ గ్లాసులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్లాస్టిక్ వల్ల ఎదురవుతున్న ఆరోగ్య, సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మన ఆలోచనా విధానం మారినప్పుడే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని చెప్పారు.

మద్యం షాపులకు స్పందన కరువు

భీమవరం: జిల్లాలోని గీత కార్మికులకు కులాల వారీగా కేటాయించిన మద్యం షాపుల దరఖాస్తులకు స్పందన కన్పించడం లేదు. దరఖాస్తుల గడువు ఈ నెల 8తో ముగియనుండగా శుక్రవారం వరకు సుమారు 113 దరఖాస్తులు మాత్రమే రావడం విశేషం. అక్టోబర్‌లో నిర్వహించిన మద్యం షాపులు దక్కించుకోడానికి పెద్ద సంఖ్యలో వ్యాపారులు పోటీపడగా ప్రస్తుతం గీత కార్మిక కులాలకు కేటాయించిన షాపులు దక్కించుకోడానికి ఆసక్తి చూపించడంలేదు. నూతన మద్యం విధానంలో అప్పట్లో జిల్లాకు 175 షాపులు కేటాయించగా ప్రభుత్వం వ్యాపారులకు 20 శాతం కమిషన్ ఇస్తామని ప్రకటించి షాపులు ప్రారంభించాక.. కమిషన్ ఇవ్వకుండా మోసం చేసింది. జనవరి 25న విడుదల చేసిన గెజిట్ నోఫికేషన్‌లో గీత కార్మిక కులాలకు 18 మద్యం షాపులు కేటాయించగా వాటిలో శెట్టిబలిజకు -10, గౌడకు -5, గౌడ్‌కు-2, శ్రీశైన-1 రిజర్వు చేశారు. గీత కార్మికులకు డిపాజిట్‌ను రూ. 2 లక్షలు, కిస్తీని రూ.32.5 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. అయినప్పటికీ షాపులను దక్కించుకోడానికి జిల్లా వ్యాప్తంగా 113 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో గడువును ఈ నెల 8 వరకు పొడిగించారు.

కేంద్రీయ విద్యాలయం నూజివీడుకు గర్వకారణం

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌అప్పారావు



నూజివీడు: నూజివీడుకు కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడం వెనుక ఎంతో కృషి ఉందని, పట్టణానికి మంచి విద్యాసంస్థను తీసుకురావాలనే లక్ష్యంతోనే ఎన్ని అవాంతరాలు ఎదురైనా అధిగమిస్తూ సాధించినట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి 8 కేంద్రీయ విద్యాలయాలు 2023లోనే మంజూరవగా అందులో ఒకటి నూజివీడని, వాటికి 2024లో బడ్జెట్‌ను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. శాశ్వత భవనాల నిర్మాణానికి ట్రిపుల్‌ఐటీని అనుకుని ఉన్న ఏడెకరాల ప్రభుత్వ స్థలాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కేటాయించారన్నారు. తాత్కాలికంగా తరగతుల నిర్వహణకు రూ.70 లక్షల వ్యయంతో పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలోని మూతపడిన పాఠశాల భవనానికి మరమ్మత్తులు చేయడంతో పాటు అదనపు గదులు నిర్మించామన్నారు. కేంద్రీయ విద్యాలయాన్ని ఏప్రిల్‌లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తొలుత ప్రారంభిస్తారని చెప్పారు. నూజివీడులో పెద్ద విద్యా సంస్థ ఏర్పాటు అవుతోందంటే ఎంతో సంతోషంగా ఉందని.. ఏనాడు శిలాఫలకాలపై పేర్ల కోసం ప్రాకులాడలేదని చెప్పారు. నూజివీడు అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై ప్రచారం చేయాలి

భీమవరం: వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అభిప్రాయపడ్డారు. భీమవరంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి సమక్షంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజలను సమాయత్తం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

అదరగొట్టారు









కుర్రకారు కేరింతలు.. ఈలల మధ్య ఏపి నిట్‌లో జరిగిన ఉల్కాన్‌జీ-2025 వేడుకలు హుషారెత్తించాయి. రెండో రోజు శుక్రవారం డ్యాన్స్‌లు, స్కిట్‌లతో అదరగొట్టారు. ఫన్నీ గేమ్స్ ఆడారు. హ్యాంగ్‌మెన్, బృందావనం, లిటరేట్ అండ్ డిబేట్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఫొటోగ్రఫీ, పెయింటింగ్, మట్టితో బొమ్మలు చేసి అబ్బురపరిచారు. మెకానికల్ ఇంజనీరింగ్ క్లబ్, స్టిక్ స్మిత్ క్లబ్, ఐఈఈఈ ఆధ్వర్యంలో కార్ రేస్‌లు చేశారు. వేదికపై విద్యార్థుల అభినయాలు కేక పుట్టించాయి. డీన్‌లు డాక్టర్ కె.హిమబిందు, జీబి.వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ తలారి రేష్మ తదితరులు పాల్గొన్నారు.

- తాడేపల్లిగూడెం

నవోదయ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 2025-26 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 8న నిర్వహించనున్న పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతికి నగరంలోని 4 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకూ జరుగుతుందన్నారు. 11వ తరగతికి నగరంలోని 2 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్‌తో మాత్రమే బబుల్ చేయాలని, పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, చేతి గడియారం, కాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. సందేహాలు ఉన్నవారు 63030 39477, 94907 28768, 96406 76608, 90785 68664, 94917 31486 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

ధాన్యలక్ష్మిగా మావుళ్లమ్మ



ధాన్యలక్ష్మిగా దర్శనమిస్తున్న మావుళ్లమ్మ

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ 61 వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మావుళ్లమ్మ వారిని ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ధాన్యలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే శనివారం మావుళ్లమ్మను ధైర్యలక్ష్మిగా అలంకరించనున్నారు.

కారు బోల్తా - వ్యక్తికి గాయాలు



బోల్తా పడిన కారు

పెంటపాడు: పెంటపాడులో రోడ్డు పక్కన నిలబడ్డ వ్యక్తికి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కారు సమీపంలోని కొబ్బరిచెట్టును ఢీ కొట్టడంతో బోల్తాపడింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బిల్లకుర్తి బాబ్జి (62) కూలి పని నిమిత్తం స్థానిక ఊరచెరువు సమీపంలో జియో ఆఫీస్ వద్ద నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వేగంగా వెళ్తున్న బాబ్జిని ఢీకొట్టి సమీపంలోని మురుగుబోదెలోకి దూసుకుపోయింది. ప్రమాదంలో బాబ్జికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్సనిమిత్తం రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. అయితే అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. సంఘటనలో కారులో ఉన్న వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు పెంటపాడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భీమవరం రైల్వే స్టేషన్ వద్ద యువకుడి ఆత్మహత్య

భీమవరం: భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై రమణ చెప్పారు. రైల్వే పట్టాలపై తల పెట్టి పడుకోవడంతో రైలు వెళ్లి తల, మొండెం రెండు ముక్కలైందని గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడు నీలం రంగు జీన్స్ ఫ్యాంట్, నలుపు రంగు టీ షర్ట్ ధరించాడని పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని ఎస్సై రమణ కోరారు.

వరిపై రసాయన పిడుగు

- సాగులో విచ్చలవిడిగా పురుగుమందుల వినియోగం
- వరిపైరుపై జింకుధాతు లోపంతో ఇబ్బందులు



పంజా వేమవరంలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

భీమవరం: దాళ్వా వరిసాగులో అధిక దిగుబడులు సాధించడానికి రైతులు ఎక్కువగా ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తున్నారు. జిల్లాలో 2.25 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తుండగా చాలా ప్రాంతాల్లో వరి పైరు పిలుకలు కట్టే దశలో ఉంది. సార్వా పంటలో అధిక వర్షాలు, వరదలు కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురైన రైతులు పెద్దగా దిగుబడి పొందలేదు. అలాగే ధాన్యం విక్రయాల్లో దళారుల ప్రమేయం కారణంగా చాలా మంది రైతులు నష్టపోయారు. సార్వాలో నష్టపోయిన రైతన్న దాళ్వా పంటలో ఎక్కువ దిగుబడి సాధించాలనే లక్ష్యంతో నాట్లు వేసిన నాటి నుంచి అధిక మోతాదులో ఎరువులు వేయడమేగాక చీడపీడలు ఆశిస్తాయనే భయంతో ముందుగానే పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు వ్యవసాయశాఖాధికారులను సంప్రందించకుండా పక్క రైతు పురుగులు మందు పిచికారీ చేస్తున్నారని తమ పైరుకు తెగుళ్ల ఆశిస్తాయనే భయంతో పురుగులు మందులు పిచికారీ చేస్తున్నారు. పురుగు మందులు అధికంగా వినియోగించడం వల్ల ఖర్చు పెరిగిపోవడమేగాక దిగుబడి కూడా తగ్గిపోయే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేగాక సేంద్రీయ విధానం అమలుచేస్తే ఖర్చు తగ్గడమేకాక ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించిన వారవుతారని అధికారులు చెబుతున్నారు. రసాయనాలు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

చల్లటి వాతావరణంతో జింకుధాతు లోపం

జిల్లా డిసెంబర్ నెలలోనే దాళ్వా నాట్లు ప్రారంభం కాగా జనవరి నెలాఖరువరకు చల్లటి వాతావరణం వల్ల వరిపైరులో ఎదుగుదల లోపించింది. సాధారణంగా దాళ్వా వరికి ఉష్ణోగ్రత ఎక్కువ ఉండడం ఉపయోగపడుతుంది. అయితే పొగమంచు ఎక్కువగా ఉండడం, చల్లటి వాతావరణం కారణంగా పెద్దగా ఎదుగుదల కానరాలేదు. దీంతో రైతులు ఎక్కువగా ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారు. అయితే ప్రస్తుతం వరిపైరుపై ఎలాంటి చీడ, పీడలు లేవని అక్కడక్కడా జింకుధాతు లోపం కన్పిస్తోందని తక్షణం చర్యలు తీసుకుంటే మంచిదని అధికారులు చెబుతున్నారు.

పురుగుమందులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

వరి సాగులో పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో గాలికి ఎదురుగా మందులు పిచికారీ చేయకూడదు. చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్క్ వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వినియోగించిన పురుగుమందుల డబ్బాలను ఎక్కడబడితే అక్కడ వేయకుడదని వివరిస్తున్నారు. పిచికారీ సమయంలో పొగ తాగకూడదని, రసాయన ఎరువలను అధికారుల సూచనల మేరకు వినియోగించాలని సూచిస్తున్నారు.

అనవసరంగా పురుగుమందులు వాడకూడదు



దాళ్వా వరిపై ప్రస్తుతం తెగుళ్ల బెడద లేదు. కొన్ని చోట్ల పైరుపై జింకు ధాతు లోపం కనిపిస్తుంది. పైరుపై భాస్వరం ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల జింక్ సమస్య ఏర్పడుతుంది. లేత ఆకులపై తుప్పు మచ్చలుంటే జింకు లోపంగా గుర్తించాలి. దీనికి ఎక్కువ మంది రైతులు క్యూమానియల్ మందును పిచికారీ చేస్తున్నారు. ఇది జింక్ లోపం నివారణకు సంబంధించినది కాదు. జింక్‌ధాతు లోపం నివారణకు జింక్ 300 గ్రాములు ఎకరా విస్తీర్ణంలో పైరు పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

వైభవంగా వాసవీ పంచలోహ విగ్రహ ప్రతిష్టానోత్సవాలు

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకాపరమేశ్వరి 90 అడుగుల పంచలోహ విగ్రహ ప్రతిష్టాపన ఆరో వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెనుగొండలో అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో శుక్రవారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు, ఉమ దంపతులు గోమాత పూజ, అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష్మీ గణపతి హోమం, వాసవీ హోమం, నక్షత్ర హోమం, నవగ్రహ హోమం, అవాహిత హోమాలు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం దాతలు బహూకరించిన స్వర్ణకిరీటం, కవచం, అమెరికన్ డైమండ్స్ పొదిగిన ఆభరణాలను మరకత శిల వాసవీ మాతకు అలంకరించి పూజలు చేశారు.

ధ్యాన మందిర నిర్మాణానికి శ్రీకారం

ప్రతిష్టాపన వార్సికోత్సవాల సందర్భంగా వాసవీ శాంతి ధాంలో ధ్యాన మందిర నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ధ్యాన మందిరం, పీఠ భవన నిర్మాణాలకు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు దంపతులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అష్టాక్షరి పీఠం త్రిదండి రామానుజ అష్టాక్షరి సంపత్‌కుమార్ స్వామిజీ, వామనాశ్రమ స్వామిజీలు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారిని వెండిరథంపై గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట భజనలు, మేళతాళాలతో ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు.





ప్రత్యేకాలంకరణలో మరకత శిల వాసవీ మాత, పెనుగొండలో వాసవీ మాత వెండి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా బాలా స్వామికి నేడు పట్టాభిషేకం

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా శ్రీప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ (బాలా స్వామి) శనివారం పట్టాభిషిక్తులు కానున్నారు. 16 ఏళ్లు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా ఉన్న కృష్ణానంద పురి స్వామిజీ గత ఏడాది జూన్ నెలలో శివైక్యం చెందారు. అప్పటి నుంచి పీఠాధిపతిని ఎంపిక చేయడానికి అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ కసరత్తు ప్రారంభించింది. చివరకు గుంటూరు జిల్లా తెనాలి శ్రీ విద్యా పీఠానికి చెందిన శ్రీప్రజ్ఞానంద సరస్వతిని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగాఎంపిక చేయడానికి సాధువులు, పలు పీఠాధిపతులు మొగ్గు చూపడంతో ట్రస్ట్ సైతం బాలాస్వామిని ఎంపిక చేశారని ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఉదయం 11.27 నిముషాలకు పట్టాభిషేకం చేయనున్నారు. క్షేత్ర పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వాసవీ శాంతి ధాంలో బాలా స్వామి పర్యవేక్షణలో వేద పాఠశాల నిర్వహణతో పాటు, ధ్యాన శిబిరం నిర్వహించనున్నారు.



గ్రామోత్సవంలో బాలాస్వామి

వివాహిత ఆత్మహత్య

ముదినేపల్లి రూరల్: పిల్లలు పుట్టరనే మనస్థాపంతో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పి.దయాసాగర్ నూజివీడుకు చెందిన సింధూర(20) ఏడు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. సింధూర గర్భం దాల్చినట్లుగా భావించి ఈ నెల 3న కైకలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్ష చేయించగా గర్భాధారణ జరగలేదని నీటి బుడగలు ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో గురువారం భర్త పనుల కోసం బయటకు వెళ్లగా స్నానం చేసి వస్తానని మేడపై గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై సమాచారం రావడంతో తహసీల్దార్ జె.సుభాని, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సింధూర తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొట్లాట కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని సుబ్బారాయుడు గుడి ప్రాంతానికి చెందిన కాప సత్యనారాయణపై 2019లో నమోదైన కొట్లాట కేసులో నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే జియావుద్దీన్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జి.అరుణ మాధురి వాదనలు వినిపించారు. పట్టణ సీఐ కె రజనీకుమార్ ప్రాసిక్యూషన్‌కు సహకారం అందించారు.

నరసాపురం అరుంధతీపేటలో ఉద్రిక్తత



వార్డులో గొడవతో రోడ్డుపైకి చేరిన ఇరువర్గాల యువకులు



గొడవకు కారణాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం: పట్టణంలోని అరుంధతీపేటలో శుక్రవారం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. రెండు వర్గాలకు చెందిన యువకులు, మహిళలు కూడా రోడ్డుమీదకు వచ్చి పరస్పరం తిట్టుకుంటూ, రాళ్లు రువ్వుకుంటూ దాడులకు దిగడంతో ఆ ప్రాంతమంతా యుద్ధవాతావరణాన్ని తలపించింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసినా కూడా ఆందోళన కారులు దాడులు చేసుకోవడం మానలేదు. దీంతో నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద స్వయంగా రంగంలోకి దిగి, బయటి స్టేషన్స్ నుంచి అదనపు సిబ్బందిని రప్పించి వారిని చెదరగొట్టారు. దీంతో రెండు గంటలు పాటు సాగిన గలాటాకు ఫుల్‌స్టాప్ పడింది. మళ్లీ వార్డులో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముందురోజు రాజుకున్న నిప్పు

నిజానికి వార్డులో రెండు కులాల మధ్య గురువారం రాత్రి గొడవ రాజుకుంది. స్థానికంగా ఉండే సామాజికవర్గాల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ఓ వర్గం వ్యక్తి బైక్‌పై వెళుతుండగా, మరో వర్గం వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో గొడవ జరగడం, ఆ వ్యక్తిని మరో వర్గం వారు కొట్టారు. దీంతో ఈ గొడవ కారణంగా ఇరు వర్గాల వారు భారీగా పోగుపడి ఘర్షణకు దిగినట్టుగా తెలుస్తుంది. ఈ గొడవలో ఇరువర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ గొడవపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించారు.

విద్య, ఉపాధి అవకాశాలకు ఇంగ్లిష్ దోహదం



ఈ-క్రష్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మరియరాణి

నూజివీడు: ఇంగ్లిష్ భాష నేడు ప్రపంచ వ్యాప్తంగా విద్య, ఉపాధి అవకాశాలకు ఎంతో దోహదం చేస్తుందని నూజివీడు ట్రిపుల్ ఐటీ ఆంగ్ల విభాగాధిపతి మరియ రాణి పేర్కొన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో శుక్రవారం ఈ క్రష్ విభాగం 9వ వార్షికోత్సవాలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఇంగ్లిషు అనేది విద్యార్థుల భవిష్యత్‌కు కీలక భాష అని అన్నారు. విద్యార్థులందరూ ఇంగ్లిషులో నిష్ణాతులుగా తయారుకావాలన్నారు. ఈ క్రష్ కన్వీనర్ కాత్యాయణి మాట్లాడుతూ ఈ విభాగం భాషాభివృద్ధిపైనే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాల పెంపుదలపై దృష్టి సారిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, ఎన్‌సీసీ క్యాడెట్‌ల పిరమిడ్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

విషపూరిత పురుగుమందులు సీజ్



పురుగు మందులను సీజ్ చేస్తున్న అధికారులు

కైకలూరు: అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు విక్రయిస్తున్న దుకాణంపై వ్యవసాయాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కైకలూరు సంతమార్కెట్ వద్ద ఏ టూ జడ్ రైతు బజారుకు చెందిన గోడౌన్‌లో అలుమినమ్ పాస్ఫైట్ అనే ప్యూమిగింగ్ పురుగు మందుల బిల్లలను కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు, ఏవో ఆర్.దివ్య గుర్తించారు. అనంతరం ఏడీ మట్లాడుతూ షిప్‌యార్డు, పెద్దపెద్ద గోడౌన్‌లలో పురుగులు మరణించడానికి దీనిని వినియోగిస్తారన్నారు. వీటి విక్రయాలకు కేంద్ర ప్రభుత్వం 15 రోజులు ప్రత్యేక శిక్షణ అందించి 5 సంవత్సరాలు లైసెన్సు అందిస్తుందన్నారు. ఇక్కడ దుకాణంలో వీటి అమ్మకాలకు అనుమతులు లేవని, గోడౌన్ పర్మిషన్ సైతం లేదని తెలిపారు. మొత్తం 623 కేజీల బిల్లలను స్వాధినం చేసుకున్నామని, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఉంటుందన్నారు. పురుగు మందుల చట్టం 1968 మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

సూర్యదేవాలయంలో విగ్రహ ప్రతిష్ట



పెదతాడేపల్లి గ్రామంలో సూర్యదేవాలయానికి యంత్రస్థాపన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి గ్రామంలో నిర్మించిన సూర్యదేవాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి కళాన్యాసం, నవరత్నన్యాసం, యంత్రస్థాపన, విగ్రహ, శిఖ ధ్వజ ప్రతిష్ఠలు, మహాప్రోక్షణ, మహాపూర్ణాహుతి తదితరులు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త పుల్లాభొట్ల సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో హోమాలు, పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



అత్తిలిలో విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి

అత్తిలి: భీష్మ ఏకాదశి సందర్భంగా అత్తిలి వేణుగోపాలస్వామికి శుక్రవారం అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి, పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బలుసులమ్మ అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షించారు. దాతలు చింతలపాటి జగన్నాథరాజు, వెంకట రమ్య దంపతులు సహకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కుంచనపల్లి శ్రీవారి ఆలయానికి విరాళం



కుంచనపల్లి శ్రీవారి ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రత్తిపాడు గ్రామానికి చెందిన అత్తిలి బాబి-సత్యవేణి దంపతులు రూ.15,555లు విరాళాన్ని శుక్రవారం ఆలయ ట్రస్ట్ కమిటీకి అందజేశారు. కమిటి అధ్యక్షుడు దాసరి మల్లిఖార్జున రావు, కామేశ్వరరావు, ఆత్కూరి పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామన మునిస్వామి

ఇరగవరం: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో శుక్రవారం ఆటో కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ ఆటో కార్మికులు 6 లక్షలు మంది ఉన్నారని, వారు స్వయం ఉపాధితో ఆటోలను నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్థిక సహాయం అందకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబ సభ్యులు సైతం ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. 50 సంవత్సరాలు నిండిన వారికి రూ. 5 వేలు పెన్షన్ అందజేయాలని కోరారు. రేలంగి మెంటయ్య, నల్ల గోపి రాజేష్, ముప్పిడి సురేష్ పాల్గొన్నారు.

పశు వైద్యులు లేరు

- ఇన్‌చార్జ్ వైద్యులే దిక్కు..
- పశువులకు సత్వర వైద్యసేవలు కనుమరుగు
- నియోజకవర్గంలో నలుగురు వైద్యుల కొరత
- నియోజకవర్గంలో 28,600 పశువులు



ఉనికిలిలో వైద్యుడు లేని పశువైద్య శాల



వేల్పూరులో వైద్యుడు లేని పశువైద్య శాల

తణుకు అర్బన్: పశువైద్యానికి కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనివ్వకపోవడంతో పశువైద్య సేవలు కునారిల్లుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా పశువైద్యశాలల్లో అందజేస్తున్న వైద్యసేవల తాలూకా గణాంకాలు కూడా దిగజారిపోతున్నాయి. కొన్ని పశువైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పశువులకు అందాల్సిన సత్వర సేవలు కూడా కుంటుపడుతున్నాయని రైతాంగం ఆరోపిస్తున్నారు. పశువుల నుంచి జంతు, పెంపుడు జీవులకు అందాల్సిన వైద్యసేవల్లో జాప్యం కలుగుతుండడంతో ఆయా రైతులు ప్రైవేటు వైద్యానికి పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి అందుబాటులో ఉన్న పశువైద్య శాలల్లో వేల్పూరు, మండపాక, ఉనికిలి, కొత్తపాడు గ్రామాల్లోని పశువైద్య శాలల్లో పశు వైద్యులు లేకపోవడంతో అసిస్టెంట్‌ల వైద్యమే ప్రస్తుతం అందుతుంది. వైద్యులు డిప్యుటేషన్‌పైనా, వైద్య కళాశాలల్లోను విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో ఈ నాలుగు ప్రాంతాల్లో వైద్యులు లేక పశు వైద్యం కుంటుపడిందని రైతులు చెబుతున్నారు. ఇన్‌చార్జ్ వైద్యులపై నడుస్తున్న ఈ వైద్యశాలల్లో

	ఆవులు	గేదెలు	గొర్రెలు	పందులు	కుక్కలు
అత్తిలి	965	6080	579	114	443
తణుకు రూరల్	683	5094	401	-	599
తణుకు అర్బన్	344	855	354	20	666
ఇరగవరం	186	7671	1210	78	591

వైద్యం కోసం రోజులతరబడి వేచిచూడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

గతమెంతో ఘనం..

గత ప్రభుత్వ హయాంలో పశువులకు సత్వర వైద్య సేవలందించేందుకు ప్రత్యేక ప్రణాళిక అనుసరించే పరిస్థితి ఉండేది. ఇంటివద్దకే పశువైద్య సేవలు అందజేయాలనే ఉద్దేశ్యంతో సంచార పశువైద్య వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి రైతాంగం చేసిన ఫిర్యాదును బట్టి ఇంటికి వెళ్లి పశువులకు సత్వర వైద్యం అందజేసేవారు. పశుపోషకులను ప్రోత్సహించే క్రమంలో రుణాలు సైతం అందించారు. నేడు గేదెలు, ఆవులకు వైద్యం సత్వరమే అందకపోవడం, ఇతర ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో రైతాంగం కూడా పశుపోషణకు దూరమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే ఇలాకాలో..

తణుకు ఎమ్మెల్యే స్వగ్రామం వేల్పూరులో పశువైద్య శాలలో గత కొన్ని నెలలుగా వైద్యులు లేకపోవడంతో పశువైద్య సేవలు అడుగంటుతున్నాయి. ఇన్‌చార్జ్ వైద్యుడితో నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. వైద్యశాలకు తీసుకువచ్చిన గేదెలు, ఆవులు, పెంపుడు కుక్కలకు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అసిస్టెంట్‌లే వారికి తోచిన వైద్యం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా వేల్పూరుకు సంబంధించిన పశు సంచార వాహనం కూడా గత 8 నెలలుగా డ్రైవర్ లేక మూలన పడినప్పటికీ తణుకు ఎమ్మెల్యే పట్టించుకున్న పాపాన పోలేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మందులు అంతంతమాత్రమే..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పశువైద్య శాలలకు రావాల్సిన మందులు కూడా సక్రమంగా రావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్రైమాసికంగా రావాల్సిన మందులు కూడా అరకొరగానే ఇస్తున్నారని తెలుస్తోంది. ఆస్పత్రుల్లో మందులు లేకపోవడంతో ప్రైవేటు మందులు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో 28,600 పశువులు...

తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణంతో పాటు అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాలకు సంబంధించి ఆవులు 28600 పశువులు ఉండగా, అందులో ఆవులు 3855, గేదెలు 19700, గొర్రెలు, మేకలు కలిపి 2544, పందులు 212, కుక్కలు 2299 ఉన్నాయి.

వైద్యసేవలు గతంలోలా లేవు

పశువుల వైద్యులు అందుబాటులోలేక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుల కోసం చూసి చూసి రోగాన్ని ముదరపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు వెళ్లినా అసిస్టెంట్‌లతోనే వైద్యం చేయించుకుని ఇంటికి తోలుకు వస్తున్నాం. పశువుల రోగాలను ముదర పెట్టకూడదని ముందుగా చూసుకోవాలని వైద్యులు చెబుతుంటారు కానీ వైద్యులు లేకపోతే వైద్యం ఎలా దొరుకుతుంది. గేదెలు, ఆవులకు వైద్యం అందడంలేదు ఇక కుక్కలకు ఏం వైద్యం చేస్తారు.

– బి.వెంకటేశ్వరరావు, మండపాక

ఇబ్బందులు లేకుండానే వైద్యసేవలందిస్తున్నాం

పశు వైద్యులు అందుబాటులో లేకపోవడాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. రానున్న రోజుల్లో బదిలీలు, పోస్టుల భర్తీ చేసే క్రమంలో ఈ సమస్య తీరనుంది. వేల్పూరు, మండపాక, ఉనికిలిలో వైద్యులు అందుబాటులో లేకపోయినా ఇన్‌చార్జ్ వైద్యులను అందుబాటులో ఉంచి వైద్యసేవలు అందజేస్తున్నాం. పశు సంచార వాహనాల్లో వేల్పూరు వాహనం అందుబాటులో లేకపోయినా కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యసేవలు అందజేస్తున్నాం.

– డాక్టర్ కె.నరసింహారావు, అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్

కల్లుగీత కులాల మద్యం దుకాణాలకు 48 దరఖాస్తులు

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కులాలకు రిజర్వు చేసిన 5 మద్యం దుకాణాలకుగాను శుక్రవారం నాటికి 48 దరఖాస్తులు అందినట్లు సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఇందులో తణుకు పట్టణానికి సంబంధించి 5, రూరల్‌కు 13, ఇరగవరం 16, పెనుగొండ 4, పెనుమంట్ర 10 దరఖాస్తులు దాఖలు చేయబడ్డాయని శనివారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందని వివరించారు.

యర్రమిల్లి నరసింహారావుకు నివాళులు



తణుకులో యర్రమిల్లి నరసింహారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు యర్రమిల్లి నరసింహారావు జయంతి సందర్భంగా తణుకు స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త డీవీఎస్‌వర్మ మాట్లాడుతూ వామపక్ష భావాలతో పాటు స్వాతంత్ర్య పోరాటంలో నరసింహారావు కీలకపాత్ర పోషించడం తణుకు ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యర్రమిల్లి నరసింహారావు కుటుంబసభ్యులు ప్రభాకరరావు, విజయలక్ష్మి సారథ్యంలో జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, సంకుమనోరమ, అడ్డాల సత్యనారాయణ, కౌరు వెంకేశ్వర్లు, అక్కిన కాశీ విశ్వనాథం, కోడూరి ఆంజనేయులు, ఆలపాటి సుబ్బారావు, పొట్ల సురేష్, పి. సామ్యూల్, కె బాల, కొండూరి రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

ముదునూరులో ఘనంగా త్రిమూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ



కొట్టు సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

పెంటపాడు: నియోజకవర్గ ప్రజలకు త్రిమూర్తుల ఆశీస్సులు మెండుగా ఉండాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ముదునూరు గ్రామంలో కాశీపాడు రోడ్డులో గ్రామ సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయ విగ్రహప్రతిష్ఠ ఉత్సవాల్లో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ దంపతులు, కొట్టు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. బాదంపూడి రామశర్మ, ఫణిశేఖరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం ఘనంగా నిర్వహించిన ప్రతిష్ఠ పూజల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కర రావు, ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, చెన్నా జనార్దన్ పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మందులు వాడాలి



అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో

అత్తిలి: ఈనెల 10వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్మయ్ కోరారు. శుక్రవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి శామ్యూల్ అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు అన్ని అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలలలో ఉచితంగా అందజేస్తారని, ఈమాత్రలను విద్యార్థులతో మింగించాలన్నారు. ఈమాత్రలు వేసుకోవడం వల్ల రక్తహీనత నివారిస్తుందని, పోషకాలు గ్రహించుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా మంచిలి, అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు అల్బెండజోల్ మాత్రలు, పోస్టర్‌లను ఎంపీడీవో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి కె శాంతమూర్తి, జెఎస్ గనిరాజు, టీవీవీ ప్రసాద్, పి మురళీ, వెంకటరాజు పాల్గొన్నారు.

పంట రక్షణకు ఎలుకల నిర్మూలన



తాడేపల్లిగూడెం రూరల్: ఎల్.అగ్రహారం గ్రామంలో ఎలుకల మందును పంపిణీ చేస్తున్న దృశ్యం



పెంటపాడు: జట్లపాలెంలో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వర్లు

తాడేపల్లిగూడెం రూరల్: ఎలుకల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్. అగ్రహారం గ్రామంలో ప్రభుత్వం సరఫరా చేసిన బ్రోమోడయోలిన్ ఎలుకల నివారణ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం 121 కిలోలు, పెంటపాడు 103 కిలోలు, గణపవరం 62 కిలోలు బ్రోమోడయోలిన్ మందు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద ఈ మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులంతా సామూహికంగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. తద్వారా ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ బ్రోమోడయోలిన్ ఎర మందును రైతులకు పంపిణీ చేశారు.

ఎలుకల మందు పంపిణీ

పెంటపాడు: రైతులు సామూహిక ఎలుకల నిర్మూలనను సమష్టిగా చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా శుక్రవారం మండలంలో అన్ని గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి కె. పార్థసారది ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఏడీఏ పి. మురళీకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జట్లపాలెం గ్రామంలో జరిగిన సమావేశంలో అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు



సత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న జాతర కమిటీ సభ్యులు

ఉండి: మండలంలోని పెదపుల్లేరులో సత్తెమ్మ అమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు 8వ తేదీ శనివారం నుంచి 16వ తేదీ సోమవారం వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. పెదపుల్లేరులో నిర్వహించిన సమావేశంలో నిర్వాహకులు జాతర వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు కావడంతో చాలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రారంభ కార్యక్రమం శనివారం ఉదయం 8:45గంటలకు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలతో వైభవంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జాతర కొరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ జాతర ఉత్సవాల్లో భాగంగా 9వ తేదీ ఆదివారం 108 కలశాలతో పంచామృతాలతో అభిషేకాలు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీరోజు భజన, సాయంత్రం పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 17వ తేదీ సోమవారం ఉదయం 1గంట నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సత్తెమ్మ అమ్మవారి దేవస్థానం, జాతర కమిటీ పెద్దలు తెలిపారు.

ఘనంగా భీష్మ ఏకాదశి మహోత్సవాలు



బాణసంచా కాల్పులు



తణుకులో విద్యుత్ వెలుగులతో ముస్తాబైన కేశవస్వామి ఆలయం

- వైభవంగా కేశవస్వామి కల్యాణం
- అలరించిన గ్రామోత్సవం

తణుకు అర్బన్: భీష్మ ఏకాదశి మహోత్సవంలో భాగంగా తణుకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకేశవ స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్ది చలువ పందిర్లు వేసి విద్యుత్ దీపాల వెలుగులు అమర్చారు. పాతవూరు శ్రీరామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్వామివారి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. రాత్రి 2.30 గంటలకు కలగర వెంకటకృష్ణ దంపతులచే స్వామివారి కల్యాణ ఘట్టం దేదీప్యమానంగా జరిపించారు. గ్రామోత్సవంలో భాగంగా బ్యాండ్ మేళాలు, ఆర్కెస్ట్రా, సన్నాయిమేళం, రామడోలు మేళం, తీన్‌మార్ డప్పులు, బాణాసంచా కాల్పులు అలరించాయి. శనివారం ఆలయ ప్రాంతంలో ఉదయం 10.30 గంటలకు భారీ అన్నసమారాధన, మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవంతో పాటు 9 నుంచి 11వ తేదీ వరకు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, 12వ తేదీన రాత్రి 8 గంటలకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతులచే శ్రీపుష్పయోగోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

దాడులు ఆందోళనకరం



సమావేశంలో మాట్లాడుతున్న తపన చౌదరి

తణుకు అర్బన్: రథసప్తమి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు, మహిళలపై ఇద్దరు యువకులు మద్యం మత్తులో దాడి చేసిన ఘటనను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి (తపన చౌదరి) ఖండించారు. మండలంలోని దువ్వలో గురువారం రాత్రి జరిగిన ఘటనలో గాయపడిన మహిళలను శుక్రవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో హిందువులపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయని, మచిలీపట్నం, పెడన, చిత్తూరు జిల్లాలోని వీకోటతో పాటు తాజాగా దువ్వలో దాడి జరగడం ఆందోళనకరమని చెప్పారు. ఇటువంటి దాడుల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని చట్టపరంగా కఠినంగా వ్యవహరించాలని కోరారు. నిందితులు అద్దంకి వెంకన్న, కాకి రవికుమార్‌లపై పోలీసులు ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాలని, రెండు నెలల క్రితం పట్టపగలు కత్తితో తిరుగుతూ కొంతమందిపై దాడి చేసినా పోలీసులు పట్టించుకోలేదన్న విషయాన్ని ప్రజలు చెబుతున్నారన్నారు. ఒక హిందూ బంధువుగా ఇక్కడికి వచ్చానని, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున హిందువులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నామని హెచ్చరించారు. దుండగుల దాడిలో గాయపడ్డ కైకాల సూర్యనారాయణ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, బీజేపీ నాయకురాలు, తణుకు మాజీ మునిసిపల్ చైర్మన్ ముళ్లపూడి రేణుక, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

10న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగు నివారణ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇరగవరం: నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈవోలు ఎస్ శ్రీనివాసరావు, జీ ప్రసాదరావు, ఇరగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతిరెడ్డి, ఏపీహెచ్ఓ సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): కార్మికులపై అధికారుల వైఖరి దారుణంగా ఉందని యూనియన్ జిల్లా కార్యదర్శి వై.వి.రావు, జోనల్ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావులు విమర్శించారు. గ్యారేజీ మెకానిక్ సస్పెన్షన్‌ను ఖండిస్తూ డిపో ఎదుట శుక్రవారం రెండో రోజు రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాధ్యులైన అధికారులను వదిలేసి సర్క్యులర్ విరుద్ధంగా యువీరావును సస్పెండ్ చేశారన్నారు.ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

యలమంచిలి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులంతా అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.